# స్వప్న సాక్షాత్కారం



## యామినీ సరస్వతి

"అమ్మాయిని చూడటానికి మగపెళ్ళి వారు రేపొస్తున్నారు. మనకు మంచి రోజులు, చెడ్డరోజులు అంటూ లేవు. కానీ వాళ్లు తిథి వార నక్షత్రాలు చూసుకుని వస్తున్నారు.... స్వప్నకి మనలాగే యివన్నీ గిట్టవు. కానీ మనం ఎదుటి వాళ్ళ అభిప్రాయాలని మన్నించాలి కదా! అది మన మర్యాద. మరి అమ్మాయి కెలా చెబుతావో నీ యిష్టం.... మొట్టమొదటి సారిగా వస్తున్నారు. నచ్చినా నచ్చక పోయినా నలుగుర్లో అవమానం మాత్రం జరక్కూడదు—"

భార్య విశాలతో అన్ని విషయాలు వివరంగా చెప్పారు విశ్వనాథంగారు. ఆయన మండలాధికారిగా పనిచేస్తోన్నా డాబూ దర్పం ఎరగని మనిషి. భార్యా తనలాటి మనిషే—మగువ మన జీవిత సమభాగిని అనే భావాలున్న మనిషి. కాపురం చేసిన పాతికేళ్ళలో ఆయన ఏనాడు అర్ధాంగిని అవమానించి ఎరుగరు. ఆమె మాటని మన్నించి గౌరవించారు.

వాళ్ళిద్దరి సంస్కారం సంస్కృతి ప్రతిబింబం అన్నట్టు వాళ్ళిద్దరికీ ఇద్దరు సంతానం. స్వప్న నోములపంట అయితే కుమార్ వరాలమూట. మంచిలో మర్యాదల్లోనే కాదు చదువు సంస్కారాల్లో కూడా తలిదండ్రులకి పేరే తెచ్చారిద్దరూ. కుమార్ ఎమ్మే పూర్తిచేసి జూనియర్ లెక్చరర్‌గా జీవితం ప్రారంభించాడు. ఏడాది క్రిందటే తను పనిచేస్తోన్న కాలేజీలోని మరో లెక్చరర్ శ్రీవల్లిని పెళ్ళి చేసుకుంటానని తలిదండ్రులతో చెప్పాడు. వంక పెట్టటానికి ఏ వంకలూ లేవు. ఈడూ జోడూ కుదిరి ముచ్చటగా వున్నా

రిద్దరూ. దాంతో ఆ వివాహానికి తథాస్తని ఆశీర్వదించారు.

అయితే స్వప్న పెళ్ళికానిదే తను పెళ్ళిచేసుకోనని కుమార్ తన పెళ్ళి వాయిదా వేస్తున్నాడు. అనాటినుంచి స్వప్నకి సంబంధాలు చూడటం వాళ్ళ కర్తవ్యమైంది. స్వప్న కూడా ఎమ్మే పూర్తిచేసింది. అయితే ఆమె దృష్టి ఐ.ఏ.యస్‌పై నుంది.

"అబ్బాయి పేరు సత్యం ఎం. టెక్ పాసై అసిస్టెంటు ఇంజనీరుగా పని చేస్తున్నాడు మంచి సంప్రదాయంగల కుటుంబం. కట్నకానుకల పేచీల్లేవు—" మళ్ళీ చెప్పారు విశ్వనాథంగారు.

'కాని స్వప్న ఏమంటుందో—" అంది విశాలి.

"మనం చెప్పి ఒప్పించాలి—"

ఆ మాటకి నవ్విందామె. "పుట్టి బుద్ధెరిగిన నాటినుండి ఏనాడూ తమ అభిప్రాయాల్ని పిల్లలపై రుద్దలేదు—వాళ్ళకి చదువు చెప్పించాం. స్వేచ్ఛ ఇచ్చాం. స్వయం నిర్ణయాధికారానికి అవకాశం కల్పించాం – ఇప్పుడిలా—"

"ఇది వేరు జీవితంలో చాలా ముఖ్యమైన విషయం—"

"ఎంతైనా ఆడపిల్లతండ్రి అనిపించు కున్నారు—"

"కొన్ని విషయాలు మనం కాదన్నా—"

"ఏంటమ్మా! నాన్న కాదంటున్నారు" హఠాత్తుగా వచ్చింది స్వప్న. పాతికేళ్ల పరువంలో చీకూచింతా, బరువు బాధ్యత లేని యువకులు కలలు కనే స్వప్నంలా వుంటుంది స్వప్న. అందానికి అందం లాగా, మాధుర్యానికి మకరందంలాగా వుంటుందామె—

"నీకు పెళ్ళిట—"

తల్లి మాటలకి పకపక నవ్వింది స్వప్న.

"నాకు పెళ్లేంటమ్మా!"

"అవునమ్మా – నీకు పెళ్ళిచూపులు. సత్యం ఎం టెక్. పూర్తిచేసి ఏ.ఇ.గా వున్నాడట. రేపు నిన్ను చూడటానికి వస్తున్నాడట. నువ్వు వాళ్ళకి, వాళ్ళు నీకునచ్చితే పెళ్ళి ఖాయంచేసుకుంటార్ట—" గబగబా చెప్పింది విశాల. ఇదే మంచి తరుణం – మళ్ళీ మించిపోతే దొరకదు అన్నట్లుగా చెప్పించి—దానితో తన బాధ్యత తీరిపోయినట్లు చూసింది. భార్య ముఖం లోని భావాలు చదివారు విశ్వనాథంగారు. అయనకి నవ్వొచ్చింది.

"ఏమిటి విశాలా! ఆ తొందర. క్షత్రియ రాజుల కొలువుకూటంలో తమ రాజుగారి రాయబారాన్ని గబగబా అప్పగించే రాయబారిలా ఏమిటా తొందర."

"నాన్నగారూ!"

అయన్నెప్పుడూ నాన్నా అనే పిలుస్తుంది స్వప్న. తనకు నచ్చని విషయమో– మెచ్చని సంగతో అయితే తప్ప అయన్ని "నాన్నగారూ" అని పిలవదామె. అది ఆ ఇద్దరికీ బాగా తెలుసు.

"నాన్నా! పెళ్ళి అంత తప్పని విషయమా!"

"తప్పని అంటావామ్మా!"

"తప్పో-ఒప్పో-మనిషి జీవితంలో పెళ్ళి అంత ముఖ్యమైందా నాన్నగారూ!"

"అవునమ్మా - నది కడలి చేరినట్లు జీవితంలో కదలి కదలి మనం సంసార సాగరం చేరాలి_"

"చేరి అందులో మునగానాం తేలానాం అన్నట్టుగా కష్టాలతో కన్నీళ్ళతో దుఃఖాలతో దురవస్థలతో ఇబ్బందుల్తో ఇక్కట్లతో క్షణక్షణం పోరాడ్తూ - ఆ సాగరంలోని మొసళ్ళతో యుద్ధం చేస్తూ- అదే బ్రతుకనుకోవాలి కదూ! తర్వాతేముంది, నేను సైతం ప్రపంచ జనాభాకి సంఖ్యా పొక్కటి జత చేస్తామన్నట్టు బ్రతకాలి కదమ్మా!"

ఆ మాటలకి పకపకా నవ్వేగాయన

"బ్రతుకులన్నీ అలానే వుండవమ్మా- ఆనందమే ఆనందం ఆనందమే జీవిత మకరందం అన్నట్టు బ్రతుకంతా వున్న మీగా బ్రతికేవాళ్ళూ వున్నారు వాళ్ళకి జీవితం ఒక రసహేల_రాసలీల. బ్రతుకు పోరాటం కాదు. పండుగ___"

"ఎక్కడో - ఎవ్వరో - హాయిగా వుండవచ్చు గాని నూటికి తొంభై మంది అప్పుల్తో తిప్పలుపడ్తూ-అధిక సంతానంతో అల్లాడ్తూ బ్రతుకు ఒక నిత్య సంగ్రామం లాగా - ఏపూట గడిస్తే ఆ పూట ముప్పు గడిచినట్టుగా-సూర్యోదయ, సూర్యాస్తమయాల్ని లెక్కపెట్టుకుంటూ బ్రతుకే బరువుగా లాక్కొస్తున్నారు-"

"స్వప్నా! ఎవరి జీవితం వాళ్ళది. ఒకరికి ముళ్ళదారి మరొకరికి మల్లెల రహదారి కావచ్చు. మన బ్రతుకు మనం దిద్దుకున్నట్లుగా వుంటుందమ్మా అదంతా మన చేతుల్లో వుంది. భార్యాభర్తలు ద్వంద్వ సమాసంలాగా వెన్నెల్లాగా, పూవు తావిలాగా, కలిసి మెలిసి గౌరవించుకుని అభిమానించుకుని జీవితాల్ని పంచుకుంటే అడుగడుగునా ఆమని_అణువణువునా పున్నమి యామిని అవుతుందమ్మా-గృహిణి ఇంటికి వెలుగు తల్లీ_"

"అందరూ మీలా వుంటారా నాన్నా!"

"అలాగే మీ అమ్మలాగా వుండరు తల్లీ_" కొన్ని క్షణాలు ఆగేడాయన. "జయాదేవుడికి పద్మావతి, నాగరాజుకు మల్లీశ్వరి_రజనికి మంజులలాగా జత కూడాలి తల్లీ-

"నాన్నా!"

"అవునమ్మా-నువ్వు సత్యాన్ని చూసి, మాటాడి, అతనిమనస్సు తెలుసుకుంటే_'

"ఆ అవకాశం వుండొద్దు నాన్నా!"

"రేపు - అందుకే వస్తున్నారమ్మా-"

స్వప్న ఇక రెట్టించలేదు.

• • •

సాయంకాలం సుమారు అయిదు గంటలు.

మేడమీద కుర్చీలో కూర్చున్నాడు సత్యం. అతని కెదురుగా అటూ యిటూ పచార్లుచేస్తోంది స్వప్న-

"మీ గురించి అంతా చెప్పారు-"

"ఎవరూ ఎవరికీ పూర్తిగా అర్థం కాలేదండీ - మా నాన్నగారికే నేను పూర్తిగా తెలీదు—ఇక ఆయన-"

ఆమె మాటలకి చిరునవ్వు నవ్వాడు సత్యం. "మీ అభిప్రాయాలు మీ అభిరుచులు .. మీ ఆరాధనలు అన్నీ చెప్పారు అవన్నీ నా ఊహలకి ప్రతిబింబాలే-రెండు మంచి అద్దాల్లో బొమ్మలెప్పుడూ ఒకేవిధంగా ప్రతిబింబిస్తాయి-"

"మీరు మీ భార్యని శాసిస్తారా?"

"ఎందుకు?"

ఆ మాటలకి తెల్లబోయిందామె.

'అర్థాంగి అంటే అర్థం తెలిసినవాడెవడూ భార్యని శాసించడు. శాసించలేడు. పలుకు—భావంలా కలిసి మెలిసి జీవిస్తే ఇది కావాలి . ఇది చేయాలి అని ఎలా ఆర్డర్ వేస్తారు?'

"పురుషాహంకారం-"

"సదా పరుషంగా వుంటాయి అహంకారం వ్యక్తి సంబంధమే కానీ అందులో విచక్షణా వుండదు స్వప్న గారూ! ఇవి మీరు ఒక నిశ్చితాభిప్రాయంతో ఏర్పరచుకున్న ఊహలు-"

"మీరు ఆమెని గౌరవిస్తారా?"

"అది నన్ను నేను గౌరవించుకోవటం కాదా?"

"ఆర్థికవిషయాల్లో స్వేచ్ఛయిస్తారా-"

"ఇంటిపెత్తనం అంతా ఆమెదే-జీతం తెచ్చి దోసిట్లో పోసి పాకెట్‌మనీ యిప్పించుకుంటానంతే-"

ఆశ్చర్యంగా చూస్తోంది ఆమె

"ఆర్థికశాఖ మీ ఆడవాళ్ళదేనండీ! పొదుపు మీవద్దే నేర్చుకోవాలి. ఉదాహరణకి చీర పొడగెక్కువైతే కత్తిరించి జాకెట్ కుట్టేస్తారు జాకెట్‌ముక్క పొడవైతే కర్చీపు కుట్టేస్తారు చీర పాతబడ్తే



పరుపుగలీబులు, డోర్‌కర్టెన్లు, కిటికీ తెరలుగా రూపాంతరం చెందిస్తారు. రాత్రి అన్నం మిగిలిపోతే దాన్ని తిరగమోత పెట్టేస్తారు-"

ఫక్కున నవ్విందామె-

"ఇలా నవ్వులు రువ్వుతూ, ఇంట్లో నవ్వుల పువ్వులు విరియిస్తూ -గృహాన్ని స్వర్గసీమగా మార్చేవాళ్ళు-ఆడవాళ్ళు-"

"కానివాళ్ళు-"

"మనకు కావివాళ్ళు- వాళ్ళ గొడవ లెందుకు?''

"సరే - కట్నం వద్దన్నార్ట-"

"నేను వద్దనలేదే - మామగారు అభిమానంతో ఆత్మీయతతో ఇస్తానన్న ధనాన్ని, బంగారాన్ని, కానుకని కాదనే మూర్ఖుడ్ని కాను-''

విస్వేరపోయిందామె. అర క్షణం కూడా కాలేదు. అంతరంగం అరవి కార్చిచ్చులా అయిపోయింది. ఎంత చదువుకున్నా-ఎంత మంచి ఉద్యోగం ఉన్నా - ఎంత ఆస్తిపాస్తులున్నా - పాల సంద్రమున పవ్వళించినవాడు పరుల పాలు కోరినట్లు-ఎదుటివారిసొమ్ము ఎంతో తీపి-దానికోసం ఆశపడ్తారు-ఎంత వారలయినా కట్నదాసులే - నో - నో - తను అలాంటివాడి పీడకూడా సహించలేదు.

క్షణక్షణానికి ఆమె ముఖంలో మారుతున్న రంగులు చూసి పకపక నవ్వేడతను... "సుమారు 40 కేజీల మేలివన్నె బంగారం; అందం, చదువు, సంస్కారం, ఇవన్నీ మూటకట్టి మూర్తిచేసి పోతపోసిన రసాధిదేవతలాటి అమ్మాయిని కానుకగా యిస్తానంటే కాదనే మూర్ఖుడ్నా చెప్పండి."

ఆమె ఆ మాటలు వినగానే _ వాటి భావం స్ఫురించగానే తెల్లబోయింది. అతని మాటల్లోని గడుసరితనం గమనించి మదినెంచింది సంతసించింది.

"మీ తలిదండ్రులు-"

"నన్ను కన్నవారు నన్ను నమ్ముకునే వారేకానీ అమ్ముకునేవారు కాదు...కన్నవారు కారు. అకొన్నవారు కారు. రక్తమాంసాలతో వ్యాపారం చేసేవారు కారు-"

"ఇప్పుడేకాదు-ఎప్పుడూ-ఎన్నడూ-ఎందునా ఈ ఇంటినుంచి ఏదీ కానుకగా అందదు-"

"నేను స్వార్జితంతో జీవించేవాడ్నే కానీ స్వార్థంతో జీవించేవాడ్నికాను. నా సంపాదనతో నా సంసారాన్ని స్వర్గం చేసుకుంటాను."


"థాంక్స్యూ! థాంక్స్యూ ఐ లయిక్ యూ-ఐ లవ్ యూ-యు ఆర్ మై కింగ్. యు ఆర్ మై రింగ్ - మై డార్లింగ్-" పొంగిన ఆనందంతో అంది స్వప్న.

• • •

"స్వప్నా! స్వప్నా! ఏమిటే ఆ కలవరింతలు" కూతుర్ని తట్టి లేపుతూ పిల్చింది విశాల. చప్పున మేల్కొంది స్వప్న.... ఎదురుగా తల్లి...

ఇది ఇదంతా కలా... ఇదంతా కల్లా ..ఊహరా కథకాదు-కలకాదు-కల్లకాదు కథ, కల, కల్ల కాకూడదు. ఈ స్వప్న సత్యం స్వప్నంగా మిగిలిపో కూడదు. యదార్థం కావాలి. తన కలలు కలవరింతలు కాకూడదు. కలకలలాడే బతుకు పులకింతలు కావాలి.

తను సత్యంతో మాటాడ్తుంది. తన మనోభావాలు వివరిస్తుంది: అతడు అన్ని




టికి అంగీకరిస్తేనే చేయి అందిస్తుంది. బ్రతుకులో వరిస్తుంది. ఆనందాన్ని వర్షిస్తుంది. అతన్ని అలరిస్తుంది.

కానినాడు అతన్నే కాదు మరెవర్నీ తనతో చేరనివ్వదు తన జీవితం తనదే అవుతుంది.

ఒక నిశ్చితాభిప్రాయానికి రాగానే ఆమె మనస్సు తేలికపడ్డట్టయింది.

"ఏంలేదమ్మా! రాబోయే వరుడితో కాబోయే పెళ్ళికోసం మనస్సులో ఒక మధురగీతం రచించుకుంటున్నాను. అది తీయని తలపులతో తీయని సంగీతమే అవుతుందో—"

అర్ధోక్తిలో ఆగిన కూతుర్ని చూస్తూ "స్వప్నా! నీ కల ఫలిస్తుందమ్మా!" అంటూ ఆశీర్వదించింది విశాల స్వప్న కళ్ళల్లో కాంతిపుంజాలు వేవెలుగులు వెదచల్లాయి.

